# సృష్టి జరిపిన పక్షపాతం

- ఆంధ్రజ్యోతి, 15-8-1975

**ఈ సమాజంలో ఆడదానికో నీతి, మగవాడికో నీతి వుండకూడదు. అయినా దానికి ఆత్మహత్య పరిష్కారం కాకూడదు.**

అతను చెప్పడం ఆపి, ఆమెనుండి ఎటువంటి జవాబు వస్తుందోనని ఆతృతగా ముందుకు వంగాడు.

ఆమె సన్నగా నవ్వింది. ఆమె నవ్వులో తన ధైర్యాన్ని కూడగట్టుకుని మరలా మొదలెట్టాడు.

"నా చొరవను మీరు మరోలా అర్థం చేసుకోవద్దు. నాలుగేళ్ళ సుదీర్ఘమైన స్నేహం మనది. కొన్ని రోజుల క్రితంవరకు నాకు ఇటువంటి ఆలోచనే లేదు. కానీ ఇప్పుడు, ఇంకొన్ని రోజుల్లో మిమ్మల్ని పూర్తిగా దూరం చేసుకోబోతున్నాననే సత్యం నన్ను నిలవ నీకుండా చేసింది. ఈ స్నేహం మనం కలకాలం... ఎందుకు నిలుపుకోకూడదు? దోషమేముంది? చెప్పండి ఉమా. మనం జీవితమంతా మంచి స్నేహితులుగా గడప కూడదా?...." అతను ఆగాడు.

"బహుశ.... బహుశ నేను అంతస్తులు మరచిపోయి మాట్లాడుతున్నానేమో...."

ఆమె చటుక్కున అందుకుది "లేదు... లేదు... అలాంటిదేమీ లేదు."

ఆమె అతని కళ్ళల్లోకి చూస్తూ అంది.

"నాకు తెలిసినంతవరకూ ఈ డబ్బు నాకు అదనపు సుఖాన్నేమీ ఇవ్వలేదు. ఇంతవరకు అమ్మా, నాన్నలనీడన వాళ్ళ అనురాగంతో అశాంతి అనేది ఎరగకుండా

బ్రతికాను. ఇక శేషజీవితం కూడా అలాగే గడుపుకోవాలనే ఆశతో, ఆ ఆశ తీరే మార్గం కొరకు ఎదురుచూస్తూ ఇన్నాళ్ళు ఆగాను. అలాంటి అనురాగమే మీ దగ్గర నుండీ, మీ వాళ్ళ దగ్గరనుండీ నేను పొందగలనని మీకన్పిస్తే...." ఆమెను మధ్యలోనే ఆపుతూ అన్నాడు.

"నామీద నమ్మకం లేదా ఉమా మీకు?"

ఆమె నిండుగా, నిర్మలంగా నవ్వుతూ అంది.

"మనది నాలుగేళ్ళ స్నేహమే కావచ్చు. కానీ నా గురించి మీకుగానీ, మీ గురించి నాకుగానీ తెలిసిందెంత?"

అతనేమీ మాట్లాడలేదు. మరలా ఆమే అంది.

"ఈ రోజు మన మధ్య ఈ ప్రస్తావన జరిగింది కనుక మనం కాస్త ఫ్రీగా మాట్లాడు కుందాం. నాకు కొన్ని నిర్దుష్టమైన భావాలున్నాయి. అది మంచో, చెడో... వాటినుండి ఇవతలకు రావడానికి ఇష్టపడను నేను. భార్యా,భర్తల మధ్య రహస్యాలు వుండకూడదు. కక్షలు, కార్పణ్యాలు, అపనమ్మకాలు, కోపతాపాలు అంటే నాకు భయం... మీరు నన్ను భరించగలరా?"

అతను చాలా ధైర్యంగా నవ్వాడు. నిశ్చయంగా భరించగలనన్నట్టు తల వూపాడు. ఆమె చెప్పసాగింది.

"నేను గాఢంగా నమ్మే నా ఆత్మసాక్షిగా చెపుతున్నాను. మీ దగ్గరనుండి దాచే రహస్యాలేమీ నా దగ్గర లేవు. ఇకముందు కూడా వుండవని నమ్మకంగా చెప్పగలను ఆ మాత్రం విశ్వాసం నా మీద నాకుంది. అలాగే మీరు కూడా... ఇలా బ్లంట్‌గా మాట్లాడు తున్నందుకు ఏమీ అనుకోకండి. ఆకర్షణలకి, ఆవేశాలకి లొంగిపోయి, నిర్ణయాలు తీసుకోవడానికి మనమేం పసిపిల్లలం కాదు. స్వీట్ సిక్స్‌టీన్స్ దాటి చాలా సంవత్సరాలు మనమీదుగా వెళ్ళిపోయాయి...."

ఆమె తల కొద్దిగా ఎత్తి కళ్ళు వాల్చుకుంటూ అంది.

"మీకు తోడుగా నిల్చిననాడు నేను మీకు మనసారా న్యాయం చేయగలననీ, చేస్తాననీ, గుండెలమీద చెయ్యి వేసుకుని చెప్పగలను నేను. అలాగే మీ తోడు నాకు సుఖమూ, ఇంత శాంతి ఇవ్వగలదని మీరు కూడా గాఢంగా నమ్మితే..... ఇందులో నా అభ్యంతరం మాత్రమేముంటుంది?..... మీరు నాకా నమ్మకాన్ని కల్గిస్తే, మీకు జీవితంలో తుదివరకూ స్నేహితురాలిగా వుంటాను."

"అంటే..."

"అర్థం కాలేదా?"

నల్లబడిన అతని ముఖం మెల్లమెల్లగా ప్రసన్నమైంది.

"మీ నమ్మకాలే నా నమ్మకాలు ఉమా!... నాకు మాత్రం ఏమున్నాయి మీకు తెలియని రహస్యాలు?" ఆఖరిమాట అనేటప్పుడు అతని కంఠం కొద్దిగా అసహజంగా ధ్వనించింది.

ఆమె అలాగే నిర్మలంగా నవ్వుతూ అతని కళ్ళల్లోకి చూస్తోంది.

"ఒట్టు వేయనా ఉమా...." తన కంఠంలోకి సహజత్వాన్ని కొనితెచ్చుకుంటూ నవ్వడానికి ప్రయత్నించాడు.

"వద్దు.... వద్దు. మనిషి మీద నమ్మకం లేనప్పుడు, ఆ మనిషి వేసే ఒట్టును నమ్ముకునేంత వెర్రితనం నాలో లేదు."

ఆమె లేచింది.

తలెత్తి ఆమెవైపు విచారంగా చూస్తూ అన్నాడతను.

"నా ప్రశ్నకు జవాబు చెప్పనేలేదు మీరు."

"ఇంకా నేనర్థం కాలేదా మీకు?" ఆమె నవ్వుతూచెయ్యి అందించింది. ఆమె చల్లని చెయ్యి ఊతతో లేచి నిల్చున్నాడతను.

"ఎంత అదృష్టవంతుడిని ఉమా నేను."

"మీరొక్కరే అదృష్టవంతులై వూర్కుంటే కాదు. నన్ను కూడా మీరు అదృష్ట వంతురాల్ని చెయ్యాలి?" మధురంగా నవ్విందామె.

అతను ఉలిక్కిపడ్డాడు. ఆమె చేతిలోవున్న అతని చెయ్యి అశాంతిగా కదిలింది.

'పోనీ చెప్పేస్తే... ఈ అమాయకురాలిముందు... తనను నిర్మలంగా నమ్ముతున్న ఈ దేవత దగ్గర నిజాన్ని దాచే శక్తి తనలో లేదు. స్నేహశీలి అయిన ఈ అపూర్వ యువతి తనను తప్పకుండా క్షమిస్తుంది... కానీ... కానీ... ఒకవేళ క్షమించకపోతే... వద్దు, వద్దు ఈ వరం తనకు జీవితాంతం కావాలి. ఈమెను పోగొట్టుకుని తాను బ్రతకలేడు.'

"ఏం కృష్ణా! ఏమైంది మీకు? అలా అయిపోయారేం?"

అతను పేలవంగా నవ్వాడు.

"పదండి మిమ్మల్ని ఇంటిదగ్గర దింపి నేను వెళతాను."

ఆమె పెదవులమీద చిరునవ్వు నింపుకుని తల అడ్డంగా వూపింది.

"ఉహుఁ ఈ రోజు అన్ని రోజుల్లా కాదు. ఈ రోజు హోటల్లో ఇద్దరం కలసి భోంచేద్దాం."

అతను క్షణంలో మారిపోయి అన్నాడు సంతోషంగా.

"అలాగే పద."

* * * * *

లక్ష్మి సరస్వతుల నీడలను పరచుకొని ఇంచుమించు తన కొడుకు వయస్సులోనే వున్న కోడలిని చూచి భయపడింది లక్ష్మీదేవమ్మ. తనకు నమస్కరించిన ఆ విద్యాధికురాలిని చూచి ఆశీర్వదించి అన్నది. "ఈ మధ్యతరగతి కుటుంబంలో నీకు సౌకర్యంగా వుంటుందో లేదో!"

"మీకు అనుమానం అక్కరలేదత్తయ్యా. సౌకర్యంగా వుంటుందని పూర్తిగా నమ్మిన తర్వాతే ఈ ఇంట్లో అడుగుపెడుతున్నాను." లక్ష్మీదేవమ్మ భయాల్ని అర్థం లేనివని కొద్దిరోజుల్లోనే పూర్తిగా నిరూపించింది ఉమ.

వాళ్ళిద్దరూ కలసి క్రొత్త జీవితంలో కొన్ని అడుగుల వేశాక, ఒకరోజు ఉదయాన్నే అడిగాడు కృష్ణ.

"నేననుకోలేదు ఉమా, నువ్వు నీ వ్యక్తిత్వాన్ని చంపుకొని, మాలో కలిసి పోతావని."

ఆమె చిత్రంగా చూసింది.

"మిమ్మల్ని అర్థం చేసుకుని, మీ ఇష్టప్రకారం నడుచుకోవడం వ్యక్తిత్వం చంపుకోవడం అవుతుందా? మీరు నా ఇష్టాల్ని మన్నించడం లేదా? అంత మాత్రం చేత వ్యక్తిత్వంలేని అసమర్థులవుతారా?"

"అదికాదు ఉమా నా ఉద్దేశం. నాకు ఎలా చెప్పాలో తెలియడం లేదు. పెళ్ళి కాక ముందు నీ చుట్టూ గిరి గీసుకుని, అందర్నీ అల్లంతదూరాన నిలబెట్టేదానివి. పైగా అందరి అమ్మాయిల్లా కాకుండా అతీతంగా వుండేవి నీ భావాలు. అలాంటిదానివి నువ్వు లేందే ఒక్క క్షణం కూడా గడవనంతగా నన్ను అల్లుకుపోయావు. అందరి ఆడవాళ్ళలాగే నీ సంసారాన్ని దిద్దుకుంటున్నావు."

ఆమె 'ఇదొక ప్రశ్నా?' అన్నట్టు చూసి అంది "అప్పుడయితే ఉత్త స్నేహితుడివి మాత్రమే."

"ఇప్పుడు?"

ఆమె పకపక నవ్వింది.

"అలాంటి ప్రశ్న ఎవరైనా వేస్తారనే మన పెద్దవాళ్ళు పదిమంది ఎదుటా నాలుగు అక్షింతలు చల్లుకోమన్నది."

"ఓ అదా!" అని అతను కూడా నవ్వసాగాడు.

ఆమె నవ్వు ఆపేసింది చటుక్కున.

"ఓ అదా అని గుర్తుచేసుకునేంత తేలికైన సంబంధమా ఇది?" అతను ఉలిక్కి పడ్డాడు. డాబామీదనుండి క్రింది జనసమూహాన్ని తదేకంగా చూస్తూ చూపు మరల్చుకున్న భార్యను చూస్తూ అనుకున్నాడతను. 'ఈమె కొన్ని సెంటిమెంట్ల' చట్రంలో బిగుసుకు పోయి ప్రతిదానినీ సీరియస్‌గా తీసుకుంటుంది. ప్రక్కింటి మోసగించబడ్డ కమల కన్నీళ్ళకు తను కన్నీళ్ళు నింపుకునే ఈ యువతి తన జీవితం కూడా మోసగించబడిందని ఆలోచించి వుండి వుండదు. చుట్టూవున్న మగవాళ్ళ బలహీనతలను అసహ్యించుకునే ఈమె తన మగవాడు కూడా అలాంటివాడే అని ఊహించనైనా ఊహించి ఉండదు. ఎలా? ఈమెకు ఈ నిజం చెప్పడం ఎలా?

* * * * *

ఆ రాత్రి భోంచేశాక భర్త ఒడిలో పడుకుని కబుర్లు చెప్తూ చెప్తూ వున్నట్టుండి ఫక్కున నవ్వింది ఉమ.

"మాధవమ్మగారు ఏమన్నారో తెలుసా?"

"ఏమన్నారేమిటి?" ఆమె చేతిని తన గుప్పెట్లోకి తీసుకుంటూ చిరునవ్వు నవ్వాడతను.

"మీకిదివరకొక పెళ్ళి అయిందిట" అని ఇంకా నవ్వసాగింది. అతని ఒడిలో తలదాచుకున్న ఆమెకు అతని ముఖం కనబడడం లేదు. ఆమె చేతిని ముడిచిన అతని గుప్పెట వదులయింది.

"మరీ అన్యాయమండీ ఈ ఆడవాళ్ళు. ఎంత 'ఎమర్జన్సీ' అబద్ధాలు సృష్టిస్తారండీ, అది వాళ్ళను సృష్టించిన బ్రహ్మకు కూడా చాతకాదు."

ఆమె అతని ముఖంవంక చూడకుండా చెప్పుకుపోతోంది. అతని తెల్లటి నొసటి మీద స్వేద బిందువులు ముత్యాల్లా మెరుస్తున్నాయి. అతని కనుపాపలు ఆమెను చూడడానికి భయపడుతున్నాయి.

"పోనీ నిజాల్ని అబద్ధాల్ని విడదీసే యంత్రాన్ని ఒకదాన్ని కనిబెట్టావేమిటి? మన 'ఫిజిక్స్ డాక్టరేట్' సార్థకమవుతుంది."

దిండు సరిచేస్తూ అంటున్న భార్యవైపు చూస్తూ మనసులోనే అనుకున్నాడు.

'తన భర్తకు ఇదివరకే ఒక పెళ్ళయిందనే సత్యాన్ని విని కూడా అనుమానించ డానికి ఆస్కారం లేనట్లు భర్తను అతిగాఢంగా నమ్ముతున్న ఈ అమాయకురాల్ని ఎంత మోసం చేస్తున్నాడు తను!'

నవ్వుతూ తలెత్తి భర్త కళ్ళల్లోకి చూచిన ఆమె ఉలిక్కిపడింది. భర్త ముఖాన్ని తన దోసిట్లోకిర తీసుకుంటూ అంది.

"అదేమిటి అలా అయిపోయారు? నేనేమయినా అన్నానా? లేక ఆ మాధవమ్మ మాటలు పట్టించుకుంటున్నారా?"

అతను ఆలోచిస్తున్నాడు. 'ఇక లాభం లేదు. ఈ మాధవమ్మ కాకపోతే మరో మీనాక్షమ్మ చెపుతుంది. నమ్మకపోయినా, నమ్మించగల ఓర్పు,సాక్ష్యం వాళ్ళకున్నాయి. వాళ్ళ నోటివెంట వినేకంటే తనే చెప్పేస్తే సరి.... బాధపడుతుంది. రెండు రోజులు మాటలు మానేస్తుంది. ఆ తర్వాత క్షమిస్తుంది.'

"కృష్ణా!".... ఆమె ఓదార్పులో కరిగిపోయాడతను. దయతో కూడిన ఆమె చూపులు సడలిపోతున్న అతని ధైర్యానికి చేయూతనిచ్చాయి. మనసును ఉగ్గబట్టుకొని భవిష్యత్తును, ఆమె క్షమాపణలో ముడిపెట్టుకుని వణికే స్వరంతో అన్నాడు.

"నిజంగానే నాకు పెళ్ళయింది ఉమా!"

ఆమె మాట్లాడలేదు, నిశ్చేష్టురాలై నమ్మలేనట్టు కన్నార్పకుండా అతని కళ్ళల్లోకి చూస్తోంది.

"అలా చూడకు ఉమా నన్ను. జరిగింది చెప్పనీ. అంతా వింటే నాకు తెలుసు నువ్వు నన్ను క్షమిస్తావు."

"చెప్పండి" అంది హీనస్వరాన అని లేచి కూర్చుంది.

"నాకు సరిగ్గా అప్పుడు పదిహేళ్ళు. ఇంటర్ చదువుతున్నాను. వంశమర్యాదలు, అమ్మాయి గుణగణాలు అన్నీ చూసి ఒక పధ్నాలుగేళ్ళ పిల్లను నాకిచ్చి పెళ్ళి చేశారు. కానీ వాళ్ళ వంశమర్యాదలు నన్ను కాపాడలేకపోయాయి." అని ఆగి "ఆ పిల్ల చెడి పోయింది ఉమా!" అన్నాడు. ఉలిక్కిపడింది ఆమె. 'పధ్నాలుగేళ్ళ పసిపిల్ల చెడి పోవటమా!'

"ఆమె ఇప్పుడెక్కడుంది?" తన కన్నీళ్ళను దాచుకుంటూ కంపిత స్వరాన అడిగింది.

"చెప్తాను, చెప్తాను" గొణిగాడతను. ఎలా మొదలెట్టి ఎలా చెప్తే ఆమె

సానుభూతిని పొందగలడో ఆలోచిస్తున్నాడతను. ఒక దశాబ్దం వెనుక జరిగిన సంఘటన తాలూకు వాక్యనిర్మాణం అతని మనసులో జరిగిపోతోంది....

* * * * *

'ఏమయింది సౌజన్యా! ఎవరేమన్నారు నిన్ను?....'

కూడగట్టుకున్న ధైర్యంతో వెక్కిళ్ళ మధ్యగా చెప్పిందామె.

'నాకప్పుడు తెలియదు నేను చేసింది తప్పని.... మిమ్మల్ని పెళ్ళి చేసుకున్నాకనే నేను ఎంత విలువైనది పోగొట్టుకున్నానో బోధపడింది. అప్పటినుండి మిమ్మల్ని మోసం చేస్తున్నాననే బాధ నన్ను పీడిస్తోంది. ఇంత అశాంతిలో నేను నిశ్చింతగా బ్రతకలేను. ఆ రోజు నాకా విషయాన్ని దాచాలనికూడా తెలియదు. దాచాలని తెలిసిన యీ రోజు దాన్ని దాచి, మీ దగ్గరకు మనస్ఫూర్తిగా రాలేకపోతున్నాను...'

'మీరు శిక్షించినా, క్షమించినా ఏదైనాసరే ఈ అశాంతినుండి మొదట బయట పడాలి' కళ్ళు తుడుచుకుని చెప్పసాగింది.

'మా గురించి మీకు పూర్తిగా తెలుసు. మా అమ్మ, నాన్నలకున్న ఆస్తి అంతా మేము ఆరుగురం సంతానం, కటిక దరిద్రమూనూ. మా ఇంటి ప్రక్కన సేఠ్‌జీ ఒకాయన వుంటూ వుండేవారు. మా నాన్నగారి వయస్సే వుంటుంది. నాకు పదేళ్ళప్పటినుండీ మా కుటుంబానికి ఆయనతో పరిచయముంది. మా నాన్నగారు హఠాత్తుగా పోవడంతో అన్నయ్య చదువు ఆగిపోవాల్సి వచ్చింది. ఆయన అన్న చదువుకు కావలసిన సహాయం చెయ్యడమే కాకుండా మా అన్నయ్యకు ఉద్యోగం వచ్చేవరకు మమ్మల్ని ఆదుకున్నాడు. మా అక్కయ్య పెళ్ళి కట్నం గొడవల్లో ఆగిపోతే, తన చేతి సొమ్ముతో అక్కను ఒక ఇంటిదాన్ని చేశాడు. ఆయనకు ఆ డబ్బు ఒక లెక్కలోనిది కాకపోవచ్చు. అయినా అందరు ధనవంతులూ అందరి బీదవాళ్ళకూ సాయం చెయ్యడంలేదు. ఈ క్షణాన కూడా మనస్ఫూర్తిగా చెప్తాను. ఆయన ఎటువంటి దురుద్దేశంతోనూ ఆ సహాయాలు చెయ్యలేదని. ఆయన ఋణం జన్మజన్మలకూ తీర్చుకోలేమని మా యింట్లో ప్రతి ఒక్కరి నోటివెంటా దగ్గర దగ్గర రెండేళ్ళు విన్నాను. నా మనస్సులోనూ అదే భావం... పూజ్యభావం నిండిపోయింది. ఆయన ఋణం తీర్చుకోవాలనే భావం నన్ను కుదిపేస్తున్న రోజుల్లో అతని ఒక్కక్షణపు ఆవేశానికి బలైపోయాను నేను. అతని కళ్ళల్లో కనబడ్డ సంతోషాన్ని చూచి, ఋణభారం తగ్గిందని సంతృప్తిపడ్డాను. ఆ తర్వాత అతను ఎందుకు చెప్పకుండా పారిపోయాడో అర్థం కాలేదు. రెండేళ్ళతర్వాత మిమ్మల్ని చేసుకున్న ఈనాడు నాకు అంతా బోధపడింది. స్త్రీకి అతి విలువయినదాన్ని ఎంత అమాయకంగా పోగొట్టు

కున్నానో బాగా అర్థమయింది. మీనుండి దాన్ని దాచాలనే విషయం కూడా యీనాడే తెలిసింది. కాని దాచడం నా వల్ల కావడంలేదు.'

అతని కళ్ళు జేవురించాయి. తన కథనంతా అమాయకంగా నిర్మలంగా అతనికి చెప్పేసి అతని తీర్మానంకొరకు చేతులు కట్టుకొని నిల్చున్న ఆ పసిపిల్లను ఒంటరిగా ఒదిలేసి అతను రివ్వున వెళ్ళిపోయాడు.

* * * * *

"నలిగిపోయిన పువ్వును నా జీవితంలోకి ఆహ్వానించలేకపోయాను. మరలా ఆ పిల్లతో కాపురం చెయ్యడానికి నా మనస్సు అంగీకరించలేదు. కొన్ని నెలలు పిచ్చిగా తిరిగాను. తర్వాత నా మార్గం నేను యెన్నుకున్నాను నా చదువులోనూ, నా పరీక్షల లోనూ, నా రీసెర్చ్‌లోనూ అంతా మర్చిపోయి మామూలు మనిషిని కాగలిగాను. నా అదృష్టం. నువ్వు నా జీవితంలో కలిశావు. నువ్వు కూడా నన్ను శిక్షించకు ఉమా!"

ఆమె వెర్రిదానిలా అతని కళ్ళల్లోకి చూస్తోంది.

"నీ మనస్సు కష్టపడుతుందేమోనని ఈ విషయాన్ని దాచాను నేను. అందుకు నన్ను క్షమించు. ఒకరినొకరుర అర్థం చేసుకున్నాం మనం... ఇక మనలో అపార్థాలు వద్దు."

ఆమె కనుపాపలు అసహనంగా కదిలాయి.

"ఈసారికి నన్ను క్షమించు ఉమా!" ఆమె చేతులు పట్టుకున్నాడతను. అతని చేతుల్ని సున్నితంగా వదిలించుకుని వెళ్ళి కళ్ళుమూసుకుని పడుకుంది ఆమె. ఆమెను ఆ ఆవేశంలో కదిలించడం ఇష్టంలేక నిశ్శబ్దంగా లేచి తన గదిలోకి వెళ్ళి పడుకున్నాడు కృష్ణ. ప్రక్కగదిలోనుండి వెక్కిళ్ళ శబ్దం మాత్రం కొన్ని నిముషాలదాకా విన్పించి, నిశ్శబ్ద మయిపోయింది.

* * * * *

నీరెండలో తెల్లటిపరుపుమీద, తెల్లటి దేహకాంతిలో ఇంకా నిశ్చలంగా నిద్ర పోతున్న భార్యను చూచి జాలిపడ్డాడు కృష్ణ. 'రాత్రి నిద్రలేదు పిచ్చిపిల్లకు' అనుకుని ఆమె ప్రక్కన కూర్చుని తలమీద చెయ్యివేసి ఉలిక్కిపడ్డాడు. ఐస్‌ముక్కలా తగిలిన ఆమె నుదురు ఏమి జరిగిందో, అతనికి స్పష్టంగా తెలియబరిచింది. సర్వశక్తులూ ఆమెతోనే హరించుకుపోయినట్టు నిర్వీర్యంగా కూలిపోయాడతను.

'ఒక్కమాట అయినా అనకుండా ఒక్క అనుమానమైనా కలిగించకుండా ఎంత నిశ్శబ్దంగా వెళ్ళిపోయింది! ఎంత పెద్ద శిక్ష విధించింది!!' అలా కూలబడిపోయిన అతను కొన్ని నెలలవరకు కోలుకోలేకపోయాడు. ఇన్ని సంవత్సరాలు గడిచిపోయినా అతనికి అర్థంగాని ప్రశ్న ఒకటి మిగిలిపోయింది. 'జీవితం పరి సమాప్తం చేసుకునే దశలో కూడా తనకు చెప్పదగ్గదంటూ... ఆమెకేమీ తోచలేదా?'

కానీ ఒక ప్రభాత సమయాన అతని ప్రశ్నకు జవాబు దొరికింది. ఇన్ని రోజులూ ఆమె గదిలోకి అడుగుపెట్టడానికి, ఆమె స్మృతులలో జారబడడానికి భయపడి ఆ గదిని పాడుపెట్టిన అతను, ఆమె జ్ఞాపకాలనుండి ఎలానూ పారిపోలేడని తెలిసిన ఈ రోజు ఆమె గదిలోకి అడుగుపెట్టాడు. ఆమె డ్రాయరులో బూజు వెనకాల మాసిపోయి, శిథిలావస్థలో వున్న రెండు కాగితాలు రెపరెపలాడ్తూ కన్పించాయి. అతనికి తెలుసు. అది తన ప్రియమైన భార్య ఆఖరివ్రాత. ఆవేశంగా తొందర తొందరగా వ్రాసినట్టున్న ఆ అక్షరాల బారులవెంట ఆతృతగా అతని కనుపాపలు పరుగెట్టాయి.

కృష్ణా!

బ్రతికితే నాకు చాలా గర్వంగా, నిశ్చింతగా నలుగురిలో తల ఎత్తుకుని బ్రతకాలని వుంటుంది. అంతేగాని ఒక పసిపిల్ల ఉసురుపోసుకున్న ఒక బలహీనుడికి భార్యగా మాత్రం బ్రతకాలనిలేదు. అందుకే నా జీవితాన్ని మధ్యలోనే మలుపు తిప్పుకుంటున్నాను. కాని ఒక్కటే అశాంతి. ఇన్ని సంవత్సరాలు తరచి తరచి నేను చేసుకున్న నిర్ణయాలు ఎంత పునాది లేకుండాపోయాయో!.... ఇన్ని ఏళ్ళు నా ఊపిరిని ఖర్చుపెట్టి నేర్చుకున్న విద్య సులువుగా చచ్చిపోవడానికి మటుకు మార్గాన్ని చూపింది.

వెళ్ళిపోయేముందు మీకు కొంచెం చెప్పాలని వుంది. నా చావు మీచేత కన్నీళ్ళు కార్పిస్తుందని తెలుసు. ఆ కన్నీళ్ళ మధ్యగా ఈ ఉత్తరంకూడా మీ మనస్సును కష్టపెట్టటం నా కిష్టంలేదు. అందుకే ఇక్కడ దాస్తున్నాను. మంచిగాని, చెడ్డగాని మీమీద నేను పెంచుకున్న మమకారం నా చేత ఈ పనిని చేయిస్తోంది. ఎప్పుడో ఒకరోజు మీరీ వుత్తరం చదువుతారు. మీలో లోపం ఎక్కడుందో, నాకు నేను ఈ శిక్ష యెందుకు విధించుకున్నానో మీకు బోధపడితే అంతే చాలు.....

మీరు ఆ పసిపిల్ల సౌజన్యను క్షమించివుంటే... ఏ కారణంగానైనా ఆమె మీకు దూరమై నన్ను చేసుకోవాల్సివస్తే నేనారోజు మిమ్మల్ని మనస్ఫూర్తిగా క్షమించి వుందును. ఆ పసిపిల్ల తెలియని వయస్సులో తప్పు చేసింది. అది మీ దృష్టిలో, నా దృష్టిలో, లోకం దృష్టిలో తప్పు కావచ్చు. ఆ అమాయకురాలికి అది తప్పనే తెలియదు. నిర్మలంగా ఆ పిల్ల అంతా మీకు చెప్పుకున్నందుకైనా మీరా పిల్లను క్షమించాల్సింది.

ఆమె నలిగిపోయిన పుష్పమని మీరు కాదన్నారు. బాగా చెప్పాలంటే వదిలేశారు. కొన్ని రోజులు సౌజన్యతో జీవితాన్ని పంచుకున్న మిమ్మల్ని అలా అనుకుని నేనూ వదిలేయాల్సిందే. కాని మిమ్మల్ని వదలి లోకంమీద పడ్తే నాకు బాగా తెలుసు, ఆడదాన్ని లోకం బ్రతకనివ్వదని. మిమ్మల్ని వదలడానికి నాకింతకంటే సులువైన మార్గం మరేదీ కన్పించలేదు.

మీరు మీ భార్య ఎంత పవిత్రంగా వుండాలని కోరుకున్నారో నేనూ నా భర్త అంతే పవిత్రంగా వుండాలని కోరుకున్నాను. అది దోషమా? మీరు మీ భార్య మీ ఒక్కరి స్వంతమూ అవాలని కోరుకున్నట్టే, నా భర్తకూడా నా ఒక్కదాని సొత్తే కావాలని కోరుకున్నాను. ఇది అంత అసహజమైన కోరికా? మీకు న్యాయమైంది నాకెందుకు అన్యాయమైందో నా కర్థం కాదు. మీ తప్పును సహజంగా తీసుకునే మనుష్యులు నా తప్పును కనీసం క్షమించనైనా క్షమించలేకపోవడం మరీ దారుణం. నేను ఒప్పుకుంటాను. సృష్టిలో అంతా సమంగా పంచబడలేదు. బీద గొప్ప, ఆడ మగ, చిన్న పెద్ద తారతమ్యాలు వుండనే వున్నాయి. కాని నీతో నూరేళ్ళు జీవితాన్ని పంచుకోవడానికి, అన్నీ వదులుకుని నీవే సర్వస్వమని వచ్చిన నీ అర్ధాంగితోనా నువ్వు బేధాల్ని సృష్టించుకుంటున్నావు? పక్షపాతాన్ని చూపుతున్నావు? నీలో అర్ధభాగాన్ని నువ్వు క్షమించుకోలేకపోయావు? మరి నేనెందుకు క్షమించాలి మిమ్మల్ని?......

మీరు సౌజన్యను సహృదయంతో క్షమించుంటే, మీరు ఈ రహస్యాన్ని నా దగ్గర దాచినందుకు బాధపడినా, అంతా పీడకలలా మర్చిపోయి నా జీవితాన్ని మీ దోసిట్లో వుంచుదును. కానీ అలా జరగలేదు. మీకో రూలూ నాకో రూలూ సృష్టించారు. సౌజన్యను క్షమించలేని మిమ్మల్ని, నన్ను క్షమించమని అడుగుతున్నారు. నావల్ల కాదు. ఇంత పక్షపాతాన్ని చూస్తూ బ్రతకాలని లేదు. జీవితంలో రాజీపడడం నా చేతకాదు. ఇది నాకు శాపం.

ఇక అవుతాను. మీమీద మమకారం, బ్రతుకుమీద మరలా ఆశ కలుగకముందే ఈ జీవితాన్ని పరిసమాప్తం చేసుకోనివ్వండి.

నమస్తే, సెలవ్.

మీ

ఉమ.